# డబ్బు-2

దారి మధ్యలో అంత వాన వస్తుందని మేము కలలో కూడా అనుకోలేదు. ఇంకో గంట వరకు వాన రాకపోయి వుంటే హాయిగా విశాఖపట్నం చేరిపోయే వాళ్ళం. రోడ్డు మీద కారు ఎగిరిపోతుందేమోనన్నంత తీవ్రంగా వీస్తోంది గాలి. అయినా మొండిగా కొంతసేపు కారు పోనిచ్చేం. కారు ముందున్న అద్దాలు కరిగిపోతున్న మంచు పలకల్లా ఉన్నాయి. కారు లైట్లు వెల్తురులో వర్షపు చినుకులు వెండి మేకుల్లా ఉన్నాయి.

ఒకచోట కారు ఆపక తప్పిందికాదు ముందు ఆగి వున్న లారీలు బస్సులూ చూసి. ఆ లారీలకు ముందు రోడ్డుకి అడ్డంగా పెద్దచెట్టు పడిపోయిందట. అంచేత ముందుకివెళ్ళలేం. కారు దిగినా అద్దాలు దించినా కరడు గట్టిపోవడం తథ్యం, అంచేత కొంతసేపు కారులోనే గడిపేం. మరి కొంత సేపటికి వర్షం తగ్గింది కాని గాలి హెచ్చిపోయింది. రోడ్డుపక్కనున్న చెట్లని మొదళ్ళ దగ్గర్నుంచీ గిరగిరా తిప్పేస్తోంది. గాలికి రాలిపోయిన ఆకులు రోడ్డుని కప్పేసేయి. కారుని వదిలేస్తే, గాలికి ఎగిరిపోతుందేమో నన్నంత బలంగా వీస్తోంది గాలి. కాని కారులో కూర్చుంటే ఏ చెట్టో మీదపడి చచ్చిపోతామని భయం. అయినా మొండిగానే కూర్చున్నాం భగవం

తుఫాన్ని తల్చుకుంటూ. ఇంతలో మా వెనుక 50 గజాల దూరంలో ఒక చెట్టు దభీమని పడిపోయింది. ఇంకా కారులో కూర్చొని వుండడం అసంభవం. కేవలం తెలివి తక్కువ కాని ఎక్కడికి వెళ్ళడం? ఎక్కడికైనా సరే. పక్కనున్న పొలాల్లోకి పోతే పాములూ, కప్పలు ఉండొచ్చుగాని చెట్లు పడి నడుములు విరగవు, అంచేత కారు దిగక తప్పలేదు. దిగేక కనిపించింది. వందగజాలలో ఒక పాకలాంటిది. పెద్ద పెద్ద చెట్లు కూడా ఆగని ఆ గాలికి ఆ పాక ఎలా ఆగి నిలబడివుందో ఆశ్చర్యమే !

పాకలోవున్న గేస్ లైటు వెల్తురునుబట్టి అందులో ఎవరో ఒకరు వుండకపోరు. వాళ్ళు ఎంత చెడ్డ వాళ్ళయినా పొలాల్లో పాములపాటి చెయ్యకపోరు. తెగించి వర్షంలో తడుస్తూ, చీకట్లో తడుముకుంటూ ఆ పాక చేరుకున్నాము. చేరుకున్నాక తెలిసింది అది కాఫీహోటలని. మేము వెళ్ళడం చూసిన కొంతమంది లారీలవాళ్ళు కూడా వచ్చేరు. మరి కొంతమంది అప్పటికే అక్కడ వున్నారు. రమారమీ అంత మందీ ఒక్కలాగే తడిసిపోయేం.

ఆ హోటల్లో పొట్టి రాటలకి బిగించిన బల్లలు బెంచీలుగా పని చేస్తున్నాయి. వాటిముందు రాతి పలకల టేబిల్సు ఉన్నాయి. చుట్టూవున్న తడికలు సినిమా పోస్టర్లు అంటించి ఉన్నాయి. ఒకమూలగా పొయ్యి వక్కన మూడు కుక్కలు ముడుచుకొని పడుకున్నాయి. ఒక కర్ర బీరువాలో సోడాలు,

జంతికలు వగైరా నిలవవుండే టిఫిన్లు వున్నాయి. పొయ్యి దగ్గర క్లీనరు కుర్రాడు కూర్చున్నాడు. ఉన్న ఒక్క కుర్చీ లోనూ ప్రొప్రయిటరు కూర్చున్నాడు. అతను కూర్చుంటే ప్రొప్రయిటరు, నిల్చుంటే సర్వర్ ! అతని పక్కనున్న టేబిలుమీదున్న గేస్‌లైటు వెలుగుతోందనడంకంటే మండుతున్నదీ అనడం నిజం ! మాతో వచ్చిన లారీలవాళ్ళు ఒక బెంచీమీద కూర్చున్నారు. అందులో మధ్య కూర్చున్నవాడిని ఒకసారి చూస్తే మళ్ళీ చూడాలనిపిస్తుంది. అతని జుత్తు సగం నెరిసినా దట్టంగా వుంది. అతని గళ్ళలుంగీ కాకీలాల్చీ తొడుక్కున్నాడు. ఆ బెంచీమీద కూర్చున్నవాళ్ళంతా కాకీ బట్టల్లోనే ఉన్నారు. అందులో ఒకడు బాగా కుర్రాడు. బహుశా లారీ క్లీనరు అయి వుంటాడు. ప్రొప్రయిటరు వాళ్ళ బల్ల దగ్గరికి వెళ్ళేడు ఏం కావాలంటూ.

"సలి సలి" సణిగేడు క్లీనరు కుర్రాడు.

"మళ్ళీ గనక సలి అన్నావంటే నంపేస్తాను, లంజికొడకా. ఇక్కడెవడూ ముండని కావలించుకొని లేడు. సలి నీకొక్కడికేకాదు. నోరుమూసుకొని ఒల్లకుండు" అని ఆ కుర్రాడ్ని నాలుగుతిట్టి నువ్వు మావోడి మాటలు యినకు. ఈడికి ఎండెక్కుతే- దాహం. పొద్దుగూకుతే- సలి. ఇలాంటి కుక్కపిల్ల లంజికొడుకు లెక్కడ దొరుకుతారో మా ప్రొప్రయిటరు తల్లికి. ఇంతకీ ఏటిస్తావ్ ? ఏడిగా ఏటుంది ? ప్రొప్రయిటరు వేపు తిరిగి అన్నాడు గళ్ళలుంగీవాడు.

"తెరువద్ద..."

"అంటే ఏటి మజ్జిగ పుణుకులేనా ?"

"జంతికై, పకోడా, బజ్జీ..." రాని ఆరవయానతో మాటాడుతున్నాడు ప్రొప్రయిటరు.

"నువ్వెంత పకోడా అన్నా నువ్వు అరవోడివనుకోం గాని; నాకు జంతిక పట్రా. మావోళ్ళకేటి కావాలో సూడు."

వాళ్ళు ఆర్డరిచ్చినవన్నీ తెచ్చేడు ప్రొప్రయిటరు.

గళ్ళలుంగీవాడు ఒక జంతిక కొరికి "హాహ్హా" అని చెంప చేత్తో పట్టుకొని ఒక్క క్షణం పోయేక "సూడు ప్రొప్రయిటరుబాబూ! ఇయ్యి పొట్లం కట్టియ్యి ఇంటికట్టికెళ్ళి పిల్లలకిస్తే దొర్లించుకుంటారు సెక్రాల్లాగ. ఇంతకీ నీ తప్పేటుందిలే. ఈ రేత్తిరి యింత వరసంలో ఇన్ని టిఫిన్లున్నాయంటే, యీ వోరానివనుకోవడం మాదే తప్పు. ఆ పకోడీలట్రా అయ్యేల్లా తగలడ్డాయో సూద్దాం సూడ్డానికి తుపాకీ గుళ్ళలావున్నాయి' గవర్నమెంటోల్లకి అమ్మి. వాటిని మన గవర్నమెంటు ఎప్పుడూ యుద్ధానికి కెల్లదు గాబట్టి అయ్యి పేలీదీ, పేలస్దీ నువ్వు సచ్చిలోవుగా తెల్దు."

ప్రొప్రయిటరు అతని మాటలకి నొచ్చుకోలేదు. అతడు పకోడీలు పట్టుకొచ్చి యిచ్చేడు. గళ్ళలుంగీవాడు ఒక పకోడీ రుచి చూసి" ఇయి కొంత నయం లంకలో ఇభీషణుల్లా మా అందరికీ "కేపే" లటుకురా. అడుగో, ఆ కొసోడికి మాత్తరం టీ. ఆడు సిన్నప్పుడు దొరలకాడ జోళ్ళు తుడిసినోడట. అంచేత ఆడు "టీ" తప్ప "కాఫీ తాగడు" అన్నాడు.

ప్రొప్రయిటరు 'కాఫీలు' 'టీ' తెచ్చి వాళ్ళ బల్లమీద పెట్టి తనకుర్చీ దగ్గరకు వెళ్ళిపోయేడు. ప్లేట్లు తీసుకోవడానికి వాళ్ళ బల్లమీద పెట్టిన కుర్చీ దగ్గరకు వెళ్ళేడు పొయ్యి దగ్గరున్న క్లీనరు.

అప్పుడే కాఫీరుచి చూసిన లుంగీవాడు "మీ ప్రొప్రయిటరు ఏటేస్నాడ్రా డికాక్షన్లొ ? కాఫీగింజలా ! సింతపిక్కలా ! ఏదైతే నేట్లే ఏడిగుంది అంతేసాలు" ఇంత సికట్లో దొరసానైతేనేటి ? దొమ్మరిసానైతేనేటి ? ఆడదైతే సాలన్నాట్ట ఎనకటి కెవడో ? అని కాఫీ పూర్తిచేసి "బీడీ ముక్కుందా గురూ" అడిగేడు పక్కవాడిని.

"లేదు గురూ" అన్నాడు, పక్కనున్న గురుడు.

"ఏటి, నీనేత బీడీముక్కలు మానిపించేసి బెంజి లారీ కొనేద్దావఁనుకుంటున్నాదేటి నీ పెళ్ళం ! బీడీ మానేస్తే దవఁళ్ళు వీకేగాని బేడా పరక మిగల్దు. నీ మాటాయమ్మ ఎలాగా యిఁదుగాని నేను సెప్తాలే."

"అచ్చే మానీలేదు గురూ" ఎపాలజెటిక్‌గా అన్నాడు పక్కవాడు.

వాళ్ళలో ఒకడు బీడీలకట్ట బల్లమీద పడేశాడు. అందరూ బీడీలు అంటించేరు.

"ఇంత స....చెమించు గురూ" అన్నాడు లారీ క్లీనరు.

అన్నం పెట్టడానికి అమ్ముండగా పెళ్ళాం దేనికి అనే వయసూరా నీది, నీకే అంత సలైతే మా మాటేటి ? సరికి

ఎవికలు సుట్టుకుపోతున్నాయి. సిన్నగా బయులెల్లినాం. ఎప్పుడు జేసుతాయో కొంప. ఈలోగా ఏ ఆఫీసరు కారో మన లారీకి గీసుకుంటే యింటికెళ్ళేది వొచ్చేవారమే. ఏం బతుకుర్రా మనయి, సీ-సీ వట్టి కుక్కబతుకులు" అన్నాడు గళ్ళలుంగీవాడు.

"మనం ఇలా సలికి సస్తూవుంటే మందు కొట్టేసి కులుకుతూ ఉంటాది మన ప్రొప్రయిట్రు ముండ."

"మనకే ఆ ముండ కున్నంత డబ్బుంటే" వాళ్ళలో ఒకడన్నాడు.

"నీకు తెల్దురా బాబూ. డబ్బుంటే ఉండే కష్టాలు, మనకేటి హాయిగా రాజులాగ ఉంటే తింటాం. నేకపోతే కడుపులో కాళ్ళెట్టుకు తొంగుంటాం. మనం వసుకోడానికి వంకావొద్దు వరుపొద్దు. మన్లాగ డబ్బునోడిని తొంగోమను సూద్దాం ఆడు పెళ్ళాన్నట్టుకు తొంగుంటాడనుకునేవ్. ఇన ప్పెట్టిని పట్టుకొని తొంగుంటాడు. ఇప్పుడు నీకే డబ్బుందనుకో యిలాగుండగలవా ? వంటలు కొట్టుకు పోనాయో యేటో నీ తోటలు పడిపోనాయో ఏటో నీ మేడ కూలి పడిపోనాదో ఏటో నీ పెళ్ళాం లేచిపోనాదో ఏటో-ఇలా టాలోచనలతో కుళ్ళిపోతావ్. ఇక మనకంటావా ? మన కొంపలు పడిపోతే మూడ్డబ్బులుతో మళ్ళీ లేపేవచ్చు. మన పెళ్లాలు యెవురుకీ అక్కరలేదు. నువ్వు లచ్చ చెప్పు, ఎయ్యి చెప్పు మన బతుకులే హాయి."

"నువ్వు ఎంత చెప్పినా డబ్బునోడి మజా మనకెలా గొస్తాది ?" ఒకడు అమాయకంగా అడిగాడు.

"డబ్బులేకపోతే బాధలు నీకు తెల్దుగాని వుంటే ఉన్న బాద నీకు తెల్దు. నీకు లచ్చ ఉంటే రెండో లచ్చ యెలాగ చేసుకోవడమా అన్నదో బాద ఐపోద్ది. నీకు బూవిఁ ఉంటే పక్క వంతులు పొలం యెలా కలిపేసుకోవడమా అన్న బాధ. నీకు యాపారం ఉంటే దొంగ లెక్కలు ఎలాగరాయడవాఁ? దొంగ బేరం ఎలాగివ్వడమా ! ఇయ్యే ఆలోసెన్లు"

"డబ్బుంటే సినిమాలు తియ్యొచ్చు."

"తిసేన్లె మా ఊరు వంతులోకడు. పదేళ్ళకిందట మెడ్రాసు ఎల్లేడు. మరి కంట పళ్ళేదు. ముందటేడు సూస్తే పట్నంలో శవాన్ని మోస్తూ అగుపడ్డాడు. దగ్గరోళ్ళు ఎవరో పోనారనుకొని అప్పుడడక్కుండా మర్నాడడిగినాను. సచ్చి నోడు దగ్గిరోడూ కాడు దాపలోడూ కాదన్నాడు. ఆ బాబు బాపనోడు కాబట్టి శవాలు మోసుకు బతుకుతున్నాడు. నువ్వే ఆ బాబయితే ఈ పాటికి నీ శవాన్నే మోసీనుందురు."

"డబ్బుంటే ఉన్నవాంతో సంతుష్టిపడి పక్కోడిబూము లకీ మేళ్ళకీ ఆశపడకుండా హాయిగా బతకలేమంటావా ?"

"అంటాను, ముమ్మాటికీ అంటాను. నీకు డబ్బుంటే దాన్ని పెంచాలని లేకపోవొచ్చు, కాని దాన్ని ఎలా నిల బెట్టుకోవాలా అనే బాద నిన్ను తినేస్తాది. కాని అది ఎల్లి పోయీ టైమొస్తే ఎల్లిపోద్ది. లచ్చిం తల్లిని కోకలో కొంగుకు కట్టేస్తే కోకిప్పుకుని ఎలిపోద్ది టయిమొచ్చినప్పుడు. మీ కేటి తెల్సు నాలుగాదివోరాల సక్కలు ?"

"ఆ టయం రాకపోతే ?"

"కాని ఏదో ఒకటొస్తాది లచ్చిందేవికి శాపముందట, ఆవిడున్నకాడ సుకంవుండకూడదని ఆఖరికి ఆయమ్మమొగుడ్ని సూడు. పెపంచం అంతా ఆ బాబుదే అయినా సంద్రంలో మకాం ఎట్టేడు. ఎక్కడ పడుకుంటాడనుకుంటావ్? పందిరి మంచంమీదా, పట్టుపరుపు మీదా కాదు. పాముమ్మీద! ఏటను బవించేస్తున్నాడంటావ్ ఆ బాబు. అందుకే ఆ యమ్మకి శాప మంటారు. ఆఖరికి మా నాయుడు కథలో లాగ పిల్లల్లేకున్న బాదేన అట్టుకుంటాది."

"ఎవరా నాయుడు? ఏమిటతని కథ?"

"అదో పెద్ద ష్టోరీలే. సెప్తాగాని ముందో బీడీ ముక్కిచ్చుకో. ఆ తర్వాత ప్రొప్రయిటరు బాబుని మరో కాఫీ అట్టుకు రమ్మను. సూడారే బాబు వారసం తగ్గిందేటో. కదకేం గాని తెల్లారీసరికి ఊరు సేరకపోతే పీకట్టుకుంటాది ప్రొప్రయిటరు తల్లి."

"వారసం అలాగే ఉంది"—అన్నాడు వాకడు గుమ్మం దాకా వెళ్ళి.

బీడి అంటించి కాఫీ చప్పరిస్తూ మొదలుపెట్టేడు అతనుకథ.

బాబోరే, నాకిందులో తెలిసింది, తక్కువ. ఇన్నది లావ్వాను. ఎంచేతంటే నాకు, తెలిసీ సరికే కదలో ఓళ్ళంతా పెద్దోళ్ళు ఐపోనారు. నా సిన్నప్పుడు అంటే పడేను రోజుల కోపాలి గెడ్డం గీయించుకుండే రోజుల్లో మా ఊళ్ళో పెద్ద నాయుడుండేవాడు. ఆ బాబెంతుండీవోడంటావో? కంచు ఇగ్రహంలా అడుగో అంతెత్తుండేవోడు. ఆ బాబు మీసాలు ఇనప మీసాల్లాగ ఇంతంతుండేవి. ఆ బాబు కొప్పు కోయిస్తే

ఆరు నవరాలు కట్టించుకోవచ్చు. సెవుల కమ్మలు కరిగిస్తే మూడుతులాలు మిగలాలన్న మాట సేతుల కడియంతో మొడితే మూడు సేర్లనూనింకుతాది. సిన్నప్పుడు ఏటికెళ్ళినప్పుడు - తుపాకీలో గుళ్ళయిపోతే సేత్తో కొట్టి సంపినాడట సిరతపుల్ని. ఆ బాబోపాలి ముండింట్లో వణ్ణంతింటూ ఏదో కోపమొచ్చి ముండ నడుం దగ్గిర కోకట్టుకొని ఎడంసేత్తో ఎదురు గోడకేసి కొట్టేసినాట్ట. ముండ సచ్చిసి గోడకి అప్పడంలా అంటుకు పోనాదట.

ఆ బాబు ఎలాగుంటాడో సెప్పినానా, ఇంకా బాబు ఆస్తిమాట. ఊరు పక్క ముప్ఫై ఊరవతల ముప్పై మొత్తం అరవై ఎకరాల మాగాణీ - ఇయిగాక అంటు మాంవిండి తోట్లు, నిమ్మతోట్లు. 6 దొడ్లు, ముప్పై గొడ్లు. మూడంస్తుల మేడ ఈ టన్నిటితోటీ రాజుని తాతా అని పిలిస్తే ఓయ్ అని పలికేవోడట రాజు."

"ఆ బాబు కెంతమంది పెళ్ళాలు."

"ఇద్దరు"

"ఏం..."

"పెళ్ళాలిద్దరన్నాను గాని ఆడోళ్ళు ఇద్దరన్నానా. ఓరాసికో కొత్త కాతా ఎడితేనేగాని ఆ బాబుకి నిద్దరట్టేది కాదట. ఆ జిల్లా హోల్ మొత్తంలో కన్స్ట్రరికాల కాంట్రాక్టు ఆ బాబుదేనట.

ఆ బాబుకి కోకల సరదా తరవాత కోర్టులు సరదా కోడిపుంజులు సరదా ఆ బాబు కిర్రు సెప్పులేసుకొని అత్తా కోడలంచు పంచి కట్టుగోని నోట్లో సుట్టెట్టుకోని మీసం

దువ్వ్కుంటూ ఈదిలో నడిసెళుతూ వుంటే ఎనకాతల ఇద్దరు నౌకిరీవోళ్ళు వొకడు కోడిపుంజూ, ఒకడు పికిలిపిట్టా, పట్టుకు నడుస్తూ వుంటే ఇలా గెలాగుండి ఓడంటావేటి దర్బారు కెళుతున్న మైసూగు లాగుండీవోడు."

"మరాబాబు పెళ్ళాలు?"

"సెందనం బొమ్మల్లాగుండీ ఓరనడంకన్నా రాతి బొమ్మల్లాగుండీ ఓరనడం కరెక్టు. కుండంత కొప్పూ, బానంత మెజ్జా, సెయ్యెత్తు విగ్రహం సల్లగా ఒక్కొక్కర్తి ఎలాగుండీ దంటావేటి? మనిషిని గుద్దితే మూడీశెలు బంగారం రాలాలన్న మాట. ఆయమ్మలిద్దరి మద్దెల ఆ బాబు నిలబడితే గాడు గేదల మద్దిల ఢిల్లీ పోతులా గుండీ వోడు."

"ఇద్దర్నెందుకు పెళ్లాడేడు?"

"అక్కడే ఉంది లిటిగీసను. ఆ ఇద్దరూ పరాయోళ్ళు కారు. అప్ప సెల్లెళ్ళే. ఆ బాబుకి మేనత్త కూతుళ్ళు. ఆ రోజుల్లో ఈ ప్రేమాలూ గట్రా ఏవీ వుండేవిగావు. ఆస్తులు పోకుండా అయిన సంబందాలు సేసుకోడం, ఆ తర్వాత మెవ ఇష్టం వచ్చినట్టు వాడుండడం, ఇదే మామూలు.

మొదట పెళ్ళయ్యాక ఆ బాబు పెళ్లాంతో పడుకున్న రోజులుకన్నా పరాయోళ్ళతో పడుకున్న రోజులే యెక్కువ. వంటికి నలభై ఏళ్ళొచ్చినా వొక నలుసూ కలగ లేదన్న ఇచారం బాబుకి లేదుగాని ఆయమ్మను పట్టుకు పీడింసేసీది. అటు పూరీ మొదలుకొని ఇటు తిరపతి వొరకూ ఆయమ్మ మొక్కని దేవుడు లేడు. కాల్లు కడగని బేమ్మడు లేడు,

నోచని నోములేదు చెయ్యని దానంలేదు. యెన్ని సేసినా బొజ్జే పెరిగింది గాని కడుపు కానరాలేదు. ఆ యమ్మకు నలభై దాటేసరికి దేముడ్నీ మొగుడ్నీ నమ్ముకోని నాబం సేదస గ్రహించేసినాది. ఆయమ్మ పాట్లేవో ఆయమ్మ వడ్డాది. ఆ పాపం నా నోట సెప్పించుకోకు. అవ్వ ! సిన్నా పెద్దా, యెక్కువాతక్కువా అన్న మాటుండేది గాదు. అన్నిపాపాలు పిల్లలకోసం సేసింది. సరదాకే సేసిందో, పిల్లలకోసంసేసిందో నాకు తెలీదుగాని, ఆ బాబు మాత్రం ఇటొచ్చి అటొచ్చి 'నీకు పిల్లలు పుట్టడం పాడుసేనులో వంటలు పండటం ఒక్క పాటే. నాను దత్తతచేసుకుంటాను. ఇంతాస్తి ఒగ్గీసిపోన్నాను. సనే నా తద్దినం నువ్వెడతావా నీ బావెడతాడా ? సొరగానికి నరకాని కిమద్దిల తలకిందులు గుండి పోనాల నేను ?" అని రోజు రోజుకీ బెదిరించీ వోడట.

ఎలాగయితేనేం ఆయమ్మకి నలభైఐదూ యాబయ్యా, ఆ బాబుకి అరవయ్యా వచ్చేసరికి ఆయమ్మకి వొక్కనయం తెలిసిపోనాదట, తనకింక పిల్లలు పుట్టరని. ఇంతాస్తిపోకుండా నిలబెట్టుకోవాలంటే వొక్కటే మారగం కనిపించింది ఆ యమ్మకి. అంచేత యెంటనే సవారీ బండి కట్టించుకోని ఓ పొద్దు పుట్టింటికి పోనాదట. పోయి సెల్లెల్ని పంపి 'యిదిగో సెల్లెలా' నాను సెప్పేది జాగ్రత్తగవిను.నాన్నీకంటే పెద్దదాన్ని. మరంచేత నాను సెప్పావొచ్చు, నువ్వినావొచ్చు. నీ మంచికీ నా మంచికీ వొక మాట సెపుతా వినుకో.

నాకు మొగుడున్నాడు. ఆ మొగుడికి లంకంత ఇల్లు, సంద్రం అంత సేనూ ఉంది గాని, ఎత్తుకోడానికి పిల్ల లేదు,

మాం సస్తే సాకలోడు నోట్లో నీళ్ళు పొయ్యాల్సిందే గాని వేరే దిక్కు లేదు.

ఇక నీకంటావా. నిలువగ ఎంతెదిగినావో అడ్డంగా అంతెదిగినావు మాన బాబు ఆస్తి తాకట్లుపోతే నీకు పసుపు కొమ్మ్మకు రాదు. నువు సిన్నదానివి. నీకు ఏవో ఆలోసెన్లుంటాయి. నీ వుద్దేశాలకు నేనడ్డురాను. అంచేత మానాయుడ్ని నీకు వుస్తికట్టనీ. పెళ్ళయ్యేక నీ సోకులు నువ్వు మానుకోకు. నాకు సేతనైన సాయం నేను చేస్తాను. ఆడదాని మెళ్ళో నల్లపూసుంటే నూరు పాపాలు కాస్తాది. మరింకింత కంటే ఇవరంగా నన్ను సెప్పమనకు. కాని ఒక్కమాట. ఎలాగో ఓలాగు ఒక్క కొడుకుని మాత్రం కనీ"

అప్పకు మొగుడులాటిది సెల్లెలు. అంచేత అసలు ఇసయం ఇట్టే గ్రహించేసింది. ఇటుపైన కడుపులు దించుకోవాలన్న బెంగుండదు. ఈడిలో మొగుడు వుంటేసాలు పెరట్లో పాపాలు పైకిరావు. అని సెప్పి పెళ్ళి కొప్పీసుకుంది, ఆ పెళ్ళి గూడా నాను సూడ్నేదు."

"రెండో పెళ్ళామన్నాం కదా ?"

"కనలేదుగాని ఆయమ్మ తప్పుకాదు ఆయమ్మ చెయ్యాల్సిందంతా సేసింది. ఆయమ్మ ప్రతీపనికీ అప్ప అండ గుండేది. అయితే అప్పకీ సెల్లెలకీ బేద మేటంటే అప్ప మొదట్లో దేముడ్ని నమ్మేక మనిషిని నమ్ముకుంది. సెల్లెలు తొలికాడ్నుంచీ మనుషుల్నే నమ్ముకుంది.

"ఇదిలాగుండగా నాయుడికి అరఘ్వైయిద్దో అరఘ్వై

యూరో వెళ్ళిపోనాయి. పిల్లల్లేరన్న దిగులుతో నడుంజారొగ్గిసిన పాపానికో జబ్బుచేసి మంచం అట్టేసినాడు. ఆ బాబలాగ మంచం ఎక్కనాడో లేదో మూల మూలల్నించీ దిగినారు. వోరసులు బొమ్మల్లాంటి పిల్లల్తో. మా కొడుకుని దత్తత సేసుకో, మా పిల్లోడ్ని సేసుకో అని ఆబాబు పేనం గొలుక్కుతినేసినారు. ఆ బాబుకూడా యములోళ్ళ నీడలుకనిపించీయో ఏటో లొంగిపోనాడు. బొందిలో పేనం ఉండగానే కొంపలో శ్రాడు నడవాలని పట్టుపట్టినాడు. అప్పుడాయమ్మలు ఏటిసేనేరనుకున్నావ్ ? ఊళ్లోవుంటే ఈగల్లాగ ఈ వోరసులు ఊరుకోరనీ నాయుడ్ని పట్నం తీసుకుపోయి అక్కడ పెద్ద డాక్టర్ల చేతిల్లో ఎట్టేరు. ఆ డాక్టర్ల మందులకో ఈ యమ్మల పాతి ప్రాత్యానికో తెల్దుగాని ఆ బాబు బైటపడి బట్టగట్టినాడు. మళ్ళీ ఊరొచ్చీలోగానే ఆ పట్నంలోనే ఆ బాబుకి నూరిపోసినారా తల్లులు నీకేటి తక్కువ దత్తత సేసుకోడానికి. దిమ్మిస దుక్కలాగున్నావు. ఓ జబ్బు సేస్తే సచ్చిపోయినట్టేనా ? ఇప్పటికీ నువ్వో గుద్దు గుద్దితే ఈశ్వరుడైనా మూడు కళ్ళూ మూసీ వోలసిందే. ఈ జిల్లాలో మూతిమీద మీసం వొచ్చిన ఏ మొగాడ్నైనా నీతో తాగమను, తినమను సూద్దాం. నీ సత్తువ నీకు తెల్దు. మాకు తెలుసు. మనకి పిల్లల్లేరంటే ఆ దోసం మాదిగాని తప్పు నీది కాదు. మూణ్ణెల్లు టయిమిచ్చు. వచ్చిన వోరసుడ్ని ఈప్మీదగుద్ది వంపించీ, నీకో గుమ్మటం లాంటి గుంటని తెచ్చి పెళ్లి జేస్తాం. ఒక సంవత్సరం టయిమియ్యి ఆ గుంటకి. అప్పటికీ అది కనకపోతే నీ యిష్టం, నీ ఆస్తికి దత్తతే సేసుకుం

టావో దానాలే సేసుకుంటావో. నీ కష్టొస్తే కొప్పులు కోసి ఈదిలోకి ఈడిసీ మమ్మల్ని" అని నచ్చచెప్పారు.

ముసిలోడికి మళ్ళీ పెళ్ళంటే మతిపోనాది. కంసాలి సెవం లాగ తలపాగ ఎట్టుకోని తయారై పోనాడు సెయ్యిమసి.

ఆ యిమ్మలు మూడ్నెల్లు టయామడిగినారా. మూడో రాల్లో పట్టుకొచ్చినారు పెళ్ళికూతుర్ని. సికాకోళం అవతల్నుంచి. మూర్తాలేపని బేమ్మడేడిసినా, బెదిరించి పెట్టించినారో మూర్తం, అదిగో నా నెళ్ళిందా పెళ్ళికి. సేతికి ఎవిఁకఁలు ఇరుసుకోని కర్చెట్టినారా పెళ్ళికి. అనకాపల్లి సరుకు పనికిరాదని బెజవాడ నుంచి తెప్పించినారు బోగం మేళం. పెళ్ళినాడు ఊళ్ళో ఎవళ్నీ పొయిలో నిప్పేసుకోనివ్వలేదు. సెరుకు పెనాలతో తెప్పించినారు సారా. తొలిపాలి నేను రుసి సూసింది ఆ పెళ్ళిలోనే.

రేత్తిరి మూర్తం. పెళ్ళి పందిరి కిట కిట లాడిపోనాది. ఆ పెళ్ళికి మా ఊరు తొలిసారి గ్యాస్ లైట్లు తెప్పిస్తా.

ఇక పెళ్ళికొడుకూ పెళ్ళికూతురూ అంతావా. సల్ల మందు అలవాటైందేమో పీటమీద కూసున్న నాయుడు పీటమీదే తూలుతున్నాడు. సిన్నప్పుడు తిరిగిన తిరుగుళ్ళకి మనిషి ఊరిపోయి ఉబ్బిన శవంలాగున్నాడు.

ఇక పెళ్లికూతురంటావా. వయసులోనే నాయుడు పెద్దా ఆమె సిన్నా. మనిషి మాత్తరం అతనంతా ఉంది. ముక్కూ నోరంతా ఉంది ఎడల్పు. పట్టుకోకా, జరీ రవికా తొడుక్కొని ఇంతింత జెబ్బలతో నల్లగా ఇలా గెలాగుందంటే....మన ఊరవతల అమ్మోరు పట్టుకోక కట్టుకొని నడి

చొచ్చేసి పీటమీద కూకుంటే వెలాగుంటుంది_అదిగలాగుంది. ఆయమ్మ పీటమీద కూకుంటే కడుపు బేమ్మడి ఒళ్లో ఉంది. మొగోడికి ఆడ ఏసం ఏసినా ఆయమ్మ కంటే బాగుంటాడు.

ఇలాగ్గ తిన్న పెళ్లిబూర్లు అరిగేయో లేదో అలా ఆ మూడో పెళ్ళానికి కడుపన్నారు రెండో నెల్నే గాజు నెట్టం చేసినారు మాకిదే ఆచారం అంటూ. పెళ్ళయిన మూడ్నెల్లకి పురిటి కొచ్చేసినట్లయి పోనాది ఆ మనిషి. ఈ ప్రతాపమంతా తనదే అయినట్లు నాయుడు తంగి వోగు అడిగనోడిదే పాపం. అందరికి సెప్పే వోడు తన పెళ్ళానికి కడుపని.... బాబుకే వోరసం తగ్గినట్టుంది సూశు — కేవడానికి నాకు కేళ్ళు పట్టేసినాయి" అని ఆగేడు బీడీ అంటిస్తూ.

"కద కానీ తర్వాత చూద్దాం" అన్నాడొకడు.

"కదదేటుందిరా అయిపోనాది. మరో నెల పోనాక ఆయమ్మ కడుపుపోనాది, ఏతాం కాడ, ఉన్న నాయుడు ఈ మాటినగానే కళ్ళుతిరిగి ఇరగబడిపోయి నూతిలో పడి నచ్చేసినాడు. ఏ బరంపురం నుంచో వోరసున్నంటూ ఎవడో వచ్చి ముగ్గురు ముండలకీ మనోవర్తి పారేసి_అదిగో నాను సెప్పేనా వోరసం పోనాదని. లారీలు స్టార్టయి పోనాయి నెగండి. మనోవర్తి మూడ్డబ్బులు మరీసి ఆ స్తంతా పట్టుకుపోయేడు" అంటూ లేచి పోయేడు అతను.